సాక్షి
నంద్యాల

గురువారం । 20 । ఫిబ్రవరి । 2025



వైభవంగా స్వాతి వేడుకలు

అహోబిలం క్షేత్రంలో బుధవారం స్వాతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పావన లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకున్నారు. 8లో▸



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా గుంటూరుకు చెందిన నటరాజ కళా కూచిపూడి అకాడమీ వారి నృత్యప్రదర్శన, కర్నూలుకు చెందిన లక్ష్మీ మహేష్ వారి హరికథాగానం అలరించింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,610.67
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 38.887
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 9,115

న్యూస్‌రీల్

బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రత



కమాండ్ కంట్రోల్ రూంలో సీసీ కెమెరాల పని తీరును పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

శ్రీశైలంటెంపుల్/ శ్రీశైలం: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైల మహాక్షేత్రంలో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. బుధవారం శ్రీశైలంలో ఆయన భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ క్యూలు, ఆలయ పరిసరాలు, శివస్వాముల ప్రత్యేక క్యూలైన్, స్నాన ఘట్టాలు, రథ మండపం, కమాండ్ కంట్రోల్ రూం, శ్రీశైలం డ్యాం, ఘాట్‌రోడ్డు మొదలైన ప్రదేశాల్లో పర్యటించి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయన వెంట నంద్యాల అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, శ్రీశైలం సీఐ ప్రసాదరావు, చంద్రబాబు, సురేష్‌కుమార్‌రెడ్డి, దేవస్థాన ఈఈ మురళీ పాల్గొన్నారు.

శివ భక్తుల సౌకర్యార్థం 22 వైద్య శిబిరాలు

గోస్పాడు: శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీశైల మల్లన్న భక్తుల సౌకర్యార్థం 22 వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ వెంకటరమణ తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బ్రాహ్మణ కొట్కూరు నుంచి శ్రీశైలం వరకు ఈ శిబిరాలు ఉంటాయన్నారు. పాదయాత్ర భక్తులు ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే సమీపంలోని శిబిరంలో ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చునన్నారు.

అధిక ధర యూరియా విక్రయిస్తే చర్యలు



రైతు సేవా కేంద్రంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

బనగానపల్లె రూరల్: ఫర్టిలైజర్ షాపుల్లో యూరియా అధిక ధరలకు విక్రయిస్తే సంబంధిత దుకాణదారుడిపై చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ హెచ్చరించారు. బుధవారం మండలంలోని యాగంటిపల్లె గ్రామంలో మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశమై మాట్లాడారు. యూరియాతో పాటు అన్ని రకాల ఎరువులను డీలర్లు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విక్రయించాలన్నారు. ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు. జిల్లాలో యూరియా కొరత లేదని చెప్పారు. అంతకు ముందు పశువైద్యులు డాక్టర్ బ్రహ్మానందరెడ్డి పశువుల్లో వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి రఘువరణ్, వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు


నంద్యాల(అర్బన్): పట్టణంలోని ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. హోల్ డీలర్ల వద్ద నుంచి కాకుండా వేరే జిల్లాల నుంచి ఎరువులు తెప్పించుకొని అమ్ముతున్నారన్న సమాచారంతో విజిలెన్స్ వ్యవసాయ అధికారి విశ్వనాథ్ పర్యవేక్షణలో స్థానిక సంతోష్‌రెడ్డి ఏజెన్సీస్‌కి వెళ్లి తనిఖీలు చేపట్టారు. ఈ దుకాణంలో 16:16:16 రకానికి చెందిన రూ.1,85,625 విలువ గల 135 బస్తాలను సీజ్ చేశారు. అదే విధంగా బాలాజీ కాంప్లెక్స్‌లోని సంజీవరెడ్డి ఏజెన్సీస్‌లో యూరియా గరిష్ట చిల్లర ధర కంటే ఎక్కువ ధరకు అమ్ముతున్నారన్న సమాచారం మేరకు రూ.16,523 విలువ గల 62 బస్తాలను సీజ్ చేశారు. అనంతరం విజిలెన్స్ వ్యవసాయాధికారి విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రతి డీలర్ ఎఫ్‌సీఓ ప్రకారం వ్యాపారాలు చేయాలని లేనిపక్షంలో డీలర్ల లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు, విజిలెన్స్ కానిస్టేబుల్ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.



తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

మిరపపంట రైతన్నల కంట్లో కారం కొట్టింది. ఎన్నో ఆశలతో పంట సాగు చేయగా చీడపీడల ఆశించి దిగుబడులపై దెబ్బ కొట్టాయి. అడపాదడపా వచ్చిన దిగుబడులకు కూడా ఆశించిన స్థాయిలో ధర లేక పోవడంతో రైతన్నలు దిగులు చెందుతున్నారు. వేలకు వేలు అప్పులు తెచ్చి పురుగు మందులు పిచికారీ చేసినా కనీసం పెట్టుబడులు కూడా చేతికి అందకపోవడంతో దిక్కుతోచడం లేదు. అన్నదాతలను ఆదుకోవాల్సిన ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోంది.

చాపిరేవుల సమీపంలో మిర్చి దిగుబడిని ఆరబెట్టిన దృశ్యం



అన్నదాత కంట్లో కారం

- తెగుళ్లు, వర్షాలతో దెబ్బతిన్న మిర్చి పంట
- దిగబడులతోపాటు పడిపోయిన ధర
- ఆందోళనలో మిర్చి రైతులు
- చోద్యం చూస్తున్న కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ హయాంలో మిరపకు రికార్డు స్థాయి ధరలు

గోస్పాడు: జిల్లాలో 25,167 ఎకరాల్లో మిర్చి సాగు చేసినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. బనగానపల్లె నియోజకవర్గంలో అత్యధికంగా 11,975 ఎకరాల్లో సాగు చేయగా, అందులో సంజామల మండలంలో అత్యధికంగా 3,119.92 ఎకరాల్లో మిరప సాగు చేశారు. గతేడాది ఆగస్టులో వచ్చిన వర్షాలు, వరదలకు, అనంతర వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మిర్చి పంట దెబ్బతింది. దీనికి తోడు నల్లతామర పురుగు, పొడ తెగులు, ఆకుముడత, బొబ్బర తెగులు, వంటి చీడపీడలు పంట దిగుబడులపై ప్రభావం చూపాయి. తెగుళ్ల వల్ల ఎక్కువ శాతం పంట తాలు కాయలుగా మారింది. గతంలో మూడు, నాలుగు కోతలు కోసేమిర్చి పంట సైతం నల్ల తామర పురుగు కారణంగా మొదటి కోతకే పంట పూర్తవుతోందని రైతులు వాపోతున్నారు.

చేతికందని పెట్టుబడులు

మిర్చి సాగు చేసిన రైతులకు ఈ ఏడాది పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. కౌలు, పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.70 వేల వరకు రైతులు ఖర్చు చేశారు. సొంత పొలం ఉన్న వారికే ఎకరానికి రూ.2.50 లక్షలు కాగా మిగిలిన వారికి మరింత అదనంగా ఖర్చు అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. రూ. లక్షలకు లక్షలు పెట్టుబడి పెట్టి పంట సాగు చేసినా దిగుబడి మాత్రం ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్లకు మించ లేదని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు ధరలు కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది క్వింటా రూ.10వేల నుంచి రూ.12 వేలు కూడా లేదని, సామాన్య రకం మిర్చి గతేడాది క్వింటాకు రూ.14 వేల ధర పలకగా ప్రస్తుతం రూ.8 వేలకు మించడం లేదంటూ రైతులు కంటతడి పెడుతున్నారు. ఒక పక్క పెరిగిన పెట్టుబడులు, తెగుళ్ల వెంటాడినా ఇప్పుడు దిగజారిన ధరలతో ఏమి చేయాలో తెలియక రైతులు అయోమయానికి గురవుతున్నారు.

దిగుబడులూ అంతంతే ..

గత నాలుగేళ్లతో పోల్చితే ఈ ఏడాది దిగుబడులు దారుణంగా పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల మించి దిగుబడులు వచ్చేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్లు వచ్చాయి. ఈ కష్ట సమయంలో రైతులను ఆదుకునే నాథుడే కరువయ్యారు. సాగుకు పెట్టుబడి ఖర్చులు కూడా రాకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది మిరప సాగుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆందోళన చెందుతున్నారు.

మద్దతు ధర ప్రకటించని ప్రభుత్వం

చీడపీడలు, తెగుళ్లు, ప్రకృతి ఆటుపోట్లను ఎదుర్కొని పంట సాగు చేసినా తీరా పంట చేతి కొచ్చే సమయానికి మద్దతు ధర లేక రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. మద్దతు ధర ప్రకటించి అండగా నిలవాల్సిన ప్రభుత్వం కూడా రైతులను పట్టించుకోవడం లేదంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించకపోవటంతో దళారుల ఇష్టారాజ్యంగా మారిందని, అయినకాడికి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని వాపోతున్నారు. శీతలగిడ్డంగుల్లో నిల్వ చేద్దామన్నా ధర రాకపోతే ఆ ఖర్చులు అదనం తప్ప ఒరిగేదేమీ లేదని చెబుతున్నారు. కొందరు రైతులు చేసేది లేక మిర్చిపంటను అయినకాడికి తెగనమ్ముకుంటుండగా, మరి కొందరు రైతులు ధర పెరుగుతుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోకుంటే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జగన్ హయాంలో ఇలా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మిర్చి పైరు రకం బట్టి క్వింటాకు రూ.18 వేల నుంచి రూ.35 వేల వరకు ధర పలికినట్లు రైతులు చెబుతున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నాలుగేళ్ల మిర్చి రైతులకు రికార్డు ధరలు లభించాయి. అంతకుముందెన్నడూ లేని విధంగా 2020- 24 మధ్య కాలం మిరప రైతులకు స్వర్ణ యుగమని పలువురు రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

పెట్టుబడులు కూడా వచ్చేలా లేవు



నా సొంత పొలంతోపాటు కొంత పొలం కౌలుకు తీసుకుని మొత్తం 8 ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. పైరు అంతంతమాత్రంగానే ఉండటంతో దిగుబడులు కూడా సక్రమంగా రావటంలేదు. ఎకరాకు రూ.2.5 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాను. ఈ ఏడాది పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చేలా లేవు. కౌలు రైతుల పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

– లోకేష్, రైతు, తేళ్లపురి

మద్దతు ధర ప్రకటించాలి



చీడపీడలు, తెగుళ్లతో పాటు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి మిర్చి సాగు చేశాను. పైరు సాగు సమయంలో వర్షాల తాకిడికి మూడుసార్లు వేయాల్సివచ్చింది. దీంతో సాగుకే రూ.లక్షల్లో ఖర్చు అయ్యింది. పైరు ఎదుగుదల కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో దిగుబడులపై ప్రభావం చూపింది. దీంతో కష్టం, పెట్టుబడి ఖర్చులు రెండూ వృథా తప్ప చేతికొచ్చే పైసా పరిస్థితి లేదు. క్వింటాకు రూ.10 వేలకు కూడా కొనేవారు రావడం లేదు. అన్ని ఖర్చులు పెరుగుతున్నా మద్దతు ధర లేక పెట్టుబడి ఖర్చుల భారం మోయాల్సి వస్తోంది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి మద్దతు ధర ప్రకటించి మిర్చి రైతులను ఆదుకోవాలి.

– జగదీశ్వరరెడ్డి, రైతు, గుంతనాల

సమష్టిగా ఆర్‌యూ అభివృద్ధికి కృషి

- నూతన వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వెంకట బసవరావు



వీసీ వెంకట బసవ రావుకు బొకే అందజేస్తున్న రెక్టార్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: సమష్టిగా రాయలసీమ యూనివర్సిటీని అభివృద్ధి చేద్దామని వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి. వెంకట బసవ రావు అన్నారు. బుధవారం వీసీగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ విజయకుమార్ నాయుడు, వర్సిటీ సైన్స్, ఆర్ట్స్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆచార్య సీవీ కృష్ణారెడ్డి, ఆచార్య ఎన్. నరసింహులు, డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య పీవీ సుందరానంద్, రీసర్చ్ డైరెక్టర్ ఆచార్య సి. విశ్వనాథరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య ఆర్. భరత్‌కుమార్ ఆర్‌యూసీఈ ప్రిన్సిపాల్ డాక్టర్ హరి ప్రసాద్ రెడ్డి తదితరులు నూతన వీసీని కలిసి బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రాబోయే మూడేళ్లలో విశ్వవిద్యాలయం అభివృద్ధికి పారదర్శకంగా ఉంటూ శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. వర్సిటీలో జరిగే ప్రతి విషయాన్ని సమాజం గమనిస్తుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరు దృష్టిలో పెట్టుకొని ప్రవర్తించాలన్నారు. అకడమిక్ క్యాలండర్‌ను తప్పనిసరిగా పాటించాలన్నారు. వర్సిటీ ఉద్యోగులు, విద్యార్థుల సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

సకల దేవతలూ.. రారండి!

- శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- యాగశాలలో ప్రత్యేక పూజలు
- ఘనంగా ధ్వజారోహణ
- నేడు భృంగివాహనసేవ





చండీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు ఈఓ, ధ్వజ పటావిష్కరణ చేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మల్లన్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సకల దేవతలూ.. రారండంటూ దేవస్థాన అధికారులు, ఆలయ అర్చకులు ఆహ్వానం పలికారు. బ్రహ్మోత్సవాలకు సారథ్యం వహించాల్సిందిగా బ్రహ్మదేవుడిని, స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవంలో కన్యాదానం చేసేందుకు మహావిష్ణువును రావాలని ఆహ్వానించారు. పరమశివుడి వాహనమైన నందిని చిత్రీకరించిన ధ్వజపటాన్ని ఆవిష్కరించారు. శ్రీశైలంలో మల్లన్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఆగమశాస్త్రానుసారంగా ఉత్సవ ప్రారంభ పూజలు జరిపారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు, అర్చకులు, వేదపండితులు, అధికారులు సంప్రదాయబద్ధంగా ఆలయ ప్రాంగణంలోని స్వామివార్ల యాగశాల ప్రవేశం చేశారు. వేదపండితులు చతుర్వేదపారాయణలు చేశారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ బ్రహ్మోత్సవ సంకల్పాన్ని అర్చకులు పఠించారు. తరువాత పుణ్యాహవచనం, చండీశ్వరపూజ జరిపించారు. అనంతరం కంకణాలకు శాస్త్రోక్తంగా పూజాదికాలు జరిపి కార్యనిర్వహణాధికారి కంకణాన్ని ధరించారు. అనంతరం బ్రహ్మోత్సవ క్రతువులకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. 7గంటలకు ధ్వజారోహణ, భేరిపూజ కార్యక్రమాలు నిర్వహించి సకల దేవతలకు ఆహ్వాన సూచికగా ధ్వజాపటాన్ని ఆవిష్కరించారు.

నేడు భృంగివాహనసేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి భృంగివాహనసేవలో భక్తులకు దర్శనమిస్తారు. గ్రామోత్సవం నిర్వహిస్తారు.

మల్లన్నకు పట్టువస్త్రాలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీకాళహస్తి దేవస్థానం అధికారులు శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. బుధవారం శ్రీకాళహస్తి దేవస్థాన ఉప కార్యనిర్వహణాధికారి ఎస్.ఆర్.కృష్ణారెడ్డి, ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, అర్చకులు, వేదపండితులు, సిబ్బంది పట్టువస్త్రాలతో శ్రీశైలం చేరుకున్నారు. ఆలయ రాజగోపురం వద్ద సంప్రదాయాన్ని అనుసరించి శ్రీశైల దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు, అధికారులు, అర్చకులు శ్రీకాళహస్తి దేవస్థాన అధికారులకు స్వాగతం పలికారు. అనంతరం శ్రీకాళహస్తి దేవస్థాన అధికారులు, వైదిక సిబ్బంది మేళతాళాలతో ఆలయ ప్రవేశం చేసి, వస్త్ర సమర్పణ చేశారు.



పట్టువస్త్రాలు తీసుకువస్తున్న శ్రీకాళహస్తి దేవస్థాన అధికారులు

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో ఇంటర్ పబ్లిక్ ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం అన్ని కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీవిఈఓ సునీత తెలిపారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్ పరీక్షకు 152 మందికి గాను 148 మంది హాజరు కాగా నలుగురు గైర్హాజరయ్యారన్నారు. అలాగే, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 151 మందికి గాను 140మంది హాజరు కాగా 11 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ-4 సర్వే



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా గ్రామాల్లో సచివాలయ సిబ్బందితో పీ-4 సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఎంపీడీఓలను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పీ-4 సర్వే ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర- 2047 విజన్‌లో భాగంగా పేదరిక నిర్మూలనకు పీ-4 (ప్రభుత్వ- ప్రైవేటు- ప్రజల భాగస్వామ్య) సర్వే ప్రక్రియను నేటి నుంచి ప్రారంభించాలన్నారు. జీరో పావర్టీ, ఉద్యోగాల సృష్టి, నైపుణ్యత పెంపు, రైతు సాధికారత, తాగునీటి రక్షణ, వరల్డ్ క్లాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్వచ్ఛ ఏపీ, మానవ వనరుల వినియోగం, శక్తి వనరుల నిర్వహణ, సాంకేతిక జ్ఞానం పెంపు తదితర పది సూత్రాల అనుసంధానంతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాల్సి ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి ప్రతి సచివాలయంలో పది సూత్రాల పట్టికను అతికించాలన్నారు. అట్టడుగు స్థాయిలో ఉన్న అతి నిరుపేదల జాబితాలు తయారు చేయాలన్నారు. పీ-4 సర్వే మార్చి 2వ తేదీలోగా పూర్తి చేసి నివేదికలు అందచేయాలన్నారు. ప్రధానంగా తండాలు, చెంచు కాలనీలు, మురికివాడల్లో నివసిస్తున్న అట్టడుగు స్థాయి కుటుంబాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ వేణుగోపాల్, డీఎల్‌డీఓ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


లేబర్ బడ్జెట్ లక్ష్యాన్ని అధిగమించండి

జిల్లాలో లేబర్ బడ్జెట్ లక్ష్యాన్ని అధిగమించేందుకు ఏపీడీలు, ఎంపీడీఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉపాధి హామీ లక్ష్యాల ప్రగతిపై సమీక్షించారు. డ్వామా ఇన్‌చార్జి పీడీ వెంకటసుబ్బయ్యతో కలిసి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ కింద వేతనదారులకు పనులు కల్పించి, పెండింగ్‌లో ఉన్న 12 లక్షల పని దినాలను మార్చి 31వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఉత్తర్వుల మేరకు గురువారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జెడ్పీలోని మినీ సమావేశ భవనంలో నిర్వహించే ఈ సమా వేశాల్లో గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సాంఘి క సంక్షేమం, విద్య, వైద్యం, మహిళాభివృద్ధి - శిశు సంక్షేమం, పనులు - ఆర్థిక ప్రణాళిక తదితర శాఖలకు సంబంధించిన అంశాలపై సమీక్ష చేస్తారన్నారు. ఈ నేపథ్యంలోనే వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు తమకు కేటాయించిన సమయానికి ఆయా స్థాయీ సంఘ సమావేశాలకు హాజరు కావాలని సీఈఓ కోరారు.

కృష్ణమ్మను వీడుతున్న సంగమేశ్వరుడు



కొత్తపల్లి: ప్రాచీన సంగమేశ్వరాలయం మరి కొద్ది రోజుల్లో పూర్తిగా జలాధివాసం వీడనుంది. గతేడాది జూలై నెల చివర్లో ఈ ఆలయం కృష్ణాజలాల్లో మునిగింది. ప్రస్తుతం శ్రీశైల జలాశయం నీటిమట్టం తగ్గుతుండటంతో ఏడు నెలల పాటు జాలాధివాసంలో ఉన్న ఈ ఆలయ గోపురాలు బయటపడ్డాయి. బుధవారం నాటికి శ్రీశైలం డ్యామ్‌లో నీటి మట్టం 850 అడుగులకు చేరడంతో ప్రాచీన ఆలయం ప్రహరీ బయట పడింది.

క్లుప్తంగా

మందుబాబులకు జరిమానా

కర్నూలు: రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ తనిఖీలు విస్తృతం చేశారు. ఇందులో భాగంగా మూడవ పట్టణ పోలీసులు 20 మంది మందుబాబులను బుధవారం అరెస్టు చేసి జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరిచారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.3,500, ఓపెన్ డ్రింకింగ్‌లో పట్టుబడిన 15 మందికి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై జిల్లా వ్యాప్తంగా నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని, మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్షతో పాటు వాహనం సీజ్ చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు పోలీసులు తెలిపారు.

కేసీ కెనాల్‌లో యువకుని మృతదేహం

గడివేముల: కరిమద్దెల గ్రామ సమీపంలోని కేసీ కెనాల్‌లో గుర్తుతెలియని యువకుని మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్‌ఐ నాగార్జున రెడ్డి బుధవారం తెలిపారు. యువకుడికి 30 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉంటుందని, బ్రౌన్ కలర్ టీ షర్టు, బ్లూ కలర్ ప్యాంటు ధరించారన్నారు. యువకుని పేరు, వివరాలు వెల్లడి కాలేదని చెప్పారు. వీఆర్‌ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వరకట్న వేధింపుల కేసులో జైలు శిక్ష

కోవెలకుంట్ల: వరకట్న వేధింపుల కేసులో న్యాయస్థానం ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి బుధవారం తెలిపారు. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన షేక్ అస్మా కౌసర్‌ను అదనపుకట్నం కోసం వేధింపులకు గురి చేస్తుండటంతో 2020లో భర్త షేక్ జుబేర్ అక్రమ్, అత్త షేక్ ఫర్‌హద్ దుల్హాన్‌పై ఫిర్యాదు చేసింది. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వరకట్నం కోసమే వేధించినట్లు సాక్ష్యాలు రుజువు కావడంతో న్యాయమూర్తి అబ్దుల్ రహిమాన్ ఇరువురి నిందితులకు ఏడాది జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. 2,500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం

వెల్దుర్తి: రోడ్డు ప్రమాదంలో మద్దయ్య(40) అనే రైతు బుధవారం మృతి చెందారు. బోయినపల్లి గ్రామానికి చెందిన ఈయన పొగాకు బేళ్లను అమ్మేందుకు మోటారు సైకిల్‌పై ఓర్వకల్లుకు వెళ్లారు. తిరిగి మోటారు సైకిల్‌పై వస్తుండగా కలుగొట్ల గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో రైతు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మద్దయ్యకు భార్య వెంకటేశ్వరమ్మ, ఇద్దరు సంతానం ఉన్నారు.

వలస కూలీ మృతి

కొత్తాళం: జీవనోపాధి కోసం కుటుంబంతో సహా గుంటూరు జిల్లాకు వెళ్లిన వలస కూలి బుధవారం మృతి చెందారు. మృతుని బంధువులు తెలిపిన వివరాల మేరకు.. కొత్తాళం మండలం సుళేకేరి గ్రామానికి చెందిన నగేష్(28)కు గ్రామంలో పనులు దొరకలేదు. గత నెలలో కుటుంబంతో సహా గుంటూరు జిల్లాకు వలస వెళ్లాడు. అక్కడ మిర్చి కోత పనులకు వెళుతూ కుటుంబంతో జీవనం కొనసాగించేవాడు. బుధవారం పనులకు ట్రాక్టర్‌లో వెళుతుండగా ప్రమాదవశత్తు ట్రాలీపై నుంచి నగేష్ కిందకు పడిపోయాడు. తోటి కూలీలు వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఊరుకాని ఊరికి పొట్టకూటి కోసం వలస వస్తే ఇలా జరిగిందని భార్య మహేశ్వరమ్మ రోదిస్తున్న తీరు అందరిని కలిచి వేస్తున్నది. నగేష్‌కు ఒక కుమార్తె ఉన్నారు.

గంజాయి, సారాపై నిఘా

ఆత్మకూరు: శ్రీశైల పరిసరాల్లో గంజాయి, నాటుసారా, లిక్కర్ అమ్మకాలపై నిఘా ఉంచామని నంద్యాల అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాముడు అన్నారు. ఆత్మకూరు పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భక్తులు శ్రీశైలేశుడిని భక్తిశ్రద్ధలతో దర్శించుకోవాలని చెప్పారు. ఎక్కడైనా మద్యం, గంజాయి, నాటుసారా విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే తమకు ఎక్సైజ్ కంట్రోల్ రూమ్ సెల్ 93909 43271 కు సమాచారం అందించాలని చెప్పారు. ఉత్సవాల నేపథ్యంలో ఈనెల 19వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఎక్సైజ్ సీఐ కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా స్వాతి వేడుకలు



స్వాతి, సుదర్శన హోమంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు



సహస్ర దీపాలంకరణ సేవలో శ్రీదేవి, భూదేవి మద్దిలేటి నరసింహస్వామి

ఆళ్లగడ్డ: అహోబిలం క్షేత్ర పరిధిలో కొలువైన నవనారసింహ క్షేత్రాలు భక్త జనసంద్రంగా మారాయి. స్వామి జన్మనక్షత్రమైన స్వాతి వేడుకలను పురస్కరించుకుని బుధవారం భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. గోవింద నామస్మరణతో నల్లమల పులకించిపోయింది. దిగువ అహోబిలంలో ఏర్పాటు చేసిన యాగశాలలో ఉత్సవమూర్తులైన శ్రీ పావన లక్ష్మీనృసింహస్వామిని, సుదర్శనమూర్తులను దేవాలయం ప్రధాన ద్వారం ఎదురుగా యాగశాలలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించారు. నవకలశాలతో తిరుమంజనం నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులను నూతన పట్టుపీతాంబరాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం వేద పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య శ్రీ స్వాతి, శ్రీసుదర్శన హోమాలు వైభవోపేతంగా నిర్వహించారు. పూర్ణాహుతితో కార్యక్రమాన్ని ముగించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ పూజలు ప్రధానార్చకులు వేణుగోపాలన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

మద్దిలేటిస్వామి ఆలయంలో..

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో మాఘ మాసాన్ని పురస్కరించుకొని స్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో వేదపండితులు జ్వాలాచక్రవర్తి శ్రీదేవి, భూదేవి సమేతుడైన మద్దిలేటి నరసింహస్వామికి సుప్రభాత సేవ, విశ్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవచనం, సుదర్శన హోమం, నవ కలశ స్నపనం, నరసింహ హోమం, పంచామృత సహిత విశేష ద్రవ్య తిరుమంజనం, ధన్వంతరి మూల మంత్ర జపం చేశారు. తర్వాత అలంకార ప్రియుడైన స్వామి వారికి సహస్రదీపాలంకరణ సేవ నిర్వహించారు. ఆలయ మాడ వీధుల్లో గోవింద నామస్మరణలు, మంగళవాయిద్యాల మధ్యన రమణీయంగా ఊరేగింపు చేపట్టారు.



కోటకొండ ఆర్‌ఎస్‌కే వద్ద వేచి ఉన్న రైతులు



ఎడ్లబండిపై యూరియా తీసుకెళ్తున్న దృశ్యం

అరకొర యూరియా.. అన్నదాత అవస్థలు

రైతులు పండించిన పంటలకు మార్కెట్‌లో మద్దతు ధర రావడం లేదు. వ్యవసాయ సీజన్‌కు కనీసం పెట్టుబడి సాయం కూడా అందడం లేదు. అవసరమైన ఎరువులు ఇవ్వడంలోనూ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. రైతు సేవా కేంద్రాలకు అరకొర యూరియా ఇస్తోంది. దీంతో ప్రైవేటు దుకాణాల వద్దకు వెళ్లి అన్నదాతలు అదనపు ధర చెల్లించి యూరియా తీసుకోవాల్సి వస్తోంది. రుద్రవరం మండల పరిధిలోని కోటకొండ రైతు సేవా కేంద్రానికి స్వల్పంగా 260 యూరియా బస్తాలు వచ్చాయి. అక్కడికి బుధవారం రైతులకు భారీగా తరలిరాగా.. ఒక్కొక్కరికి కేవలం మూడు బస్తాలు ఇచ్చారు. ఖరీఫ్‌లో తీవ్రంగా నష్టపోయామని, రబీలో వరి, మినుము, మొక్కజొన్న వేసినా యూరియా స్వల్పంగా ఇచ్చారని రైతులు అసహనం వ్యక్తం చేశారు. – రుద్రవరం

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం

పత్తికొండ రూరల్: ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి ఉన్న రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తాయని ఉద్యానవన శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి అన్నారు. పత్తికొండ రైతు సేవా కేంద్రంలో బుధవారం రైతులకు ఉద్యాన పంటల సాగు, ప్రోత్సాహకాలు తదితర అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ పండ్లతోటలు ఉన్న రైతులకు ప్యాక్ హౌస్‌కు రూ.2 లక్షలు, పాంఫాండ్ నిర్మాణానికి రూ.75 వేలు, ఉల్లి నిల్వ గోడౌన్‌కు రూ.80 వేలు సబ్సిడీ ఉంటుందన్నారు. అనంతరం సూక్ష్మ సేద్య పథకం గురించి వివరించారు. బిందు సేద్యానికి ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం రాయితీ వస్తుందన్నారు. బీసీ రైతులకు 90శాతం సబ్సిడీతో పరికరాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు దస్తగిరి, జయరామిరెడ్డి, నాగసునీల్, ఖాజాహుసేన్, డీలర్లు పాల్గొన్నారు.

శాశ్వత లోక్ అదాలత్‌లో విద్యార్థికి న్యాయం

కర్నూలు(సెంట్రల్): శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించిన విద్యార్థికి న్యాయం జరిగిందని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్ తెలిపారు. నంద్యాలకు చెందిన పి.వంశీ అనే విద్యార్థి 2022లో ఆర్‌జీఎం కాలేజీలో ఇంజినీరింగ్ చేరాడు. అయితే అతను 6 నెలలు మాత్రమే కాలేజీకి వచ్చి కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో ప్రైవేట్ ఉద్యోగంలో చేరేందుకు యత్నించాడు. అయితే కళాశాలలోనే టెన్త్, ఇంటర్ సర్టిఫికెట్లు ఉండడంతో యాజమాన్యం నాలుగు సంవత్సరాలకు సంబంధించిన రూ.3 లక్షలు కడితే తప్ప సర్టిఫికెట్లు ఇవ్వమని చెప్పారు. అతను శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించాడు. ఈ కేసులో ప్రతివాది ఆర్‌జీఎం కళాశాలకు శాశ్వత లోక్ అదాలత్ జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్, సభ్యులు శివశంకర్‌రెడ్డి, రాజుబాబుల ఆధ్వర్యంలో బెంచ్ నోటీసులు ఇచ్చి రాజీకుదర్చాయి. దీంతో బుధవారం పి.వంశీకి సర్టిఫికెట్లను ఇచ్చారు.

స్కూటర్ మంజూరైందంటూ మోసం ..!

మద్దికెర: 'మేము కర్నూలు నుంచి మాట్లాడుతున్నాం. గవర్నమెంట్ మీకు స్కూటర్ మంజూరు చేసింది. కొంత మొత్తం చెల్లిస్తే మీకు కేటాయిస్తాం' అంటూ దివ్యాంగులను నమ్మించి మోసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. మద్దికెర గ్రామానికి చెందిన దివ్యాంగులు రామకృష్ణ, శ్రీలక్ష్మి, ఆదిలక్ష్మి మరో ఇద్దరికి 9642076467, 6364506562 నంబర్ల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేశారు. 'మీకు ప్రభుత్వం త్రిచక్ర వాహనం మంజూరు చేసింది. కొంత మొత్తం చెల్లిస్తే మీ ఇంటికి స్కూటీ వస్తుంద'ని మూడు రోజుల క్రితం నమ్మించారు. వారి మాటలను నమ్మి ముగ్గురు దివ్యాంగులు మొత్తం రూ. 20 వేలు ఫోన్ పే చేశారు. ఆ తర్వాత రోజు నుంచి ఆ నంబర్లకు ఫోన్ చేసినా ఎటువంటి సమాధానం లేకపోవడంతో మోసపోయామని తెలుసుకుని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దివ్యాంగులను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వీరాంజి, అంజనేయులు, మల్లికార్జున కోరారు.



పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న దివ్యాంగులు

అహోబిలేశుడి సేవలో..



తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ రామ్‌సింగ్

ఆళ్లగడ్డ: అహోబిల లక్ష్మీ నరసింహస్వామి వార్లను ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ రామ్‌సింగ్ బుధవారం దర్శించుకున్నారు. అహోబిలం చేరుకున్న ఆయనకు ప్రధానార్చకులు వేణుగోపాలన్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం ఎగువ, దిగువ అహోబిలం క్షేత్రాల్లోని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆయనకు స్వామివార్ల శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట నంద్యాల ఈఈ శ్రీనివాసరెడ్డి, ఆళ్లగడ్డ డీఈఈ రవికాంత్‌చౌదరి ఉన్నారు.

మాతృ మరణాల శాతం తగ్గించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో మాతృ మరణాల శాతం తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి. శాంతికళ అన్నారు. బుధవారం ఆమె తన చాంబర్‌లో మాతృమరణాలపై సమీక్ష నిర్వహించారు. కల్లూరు, నన్నూరు, హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో సంభవించిన మూడు మాతృమరణాలపై ఆమె వివరాలు సేకరించారు. క్షేత్ర స్థాయిలోని సిబ్బంది ఆశా, ఆరోగ్య కార్యకర్త, వైద్యాధికారులు గర్భిణులను గుర్తించి వారికి సకాలంలో వైద్యసేవలు అందించినట్లయితే తల్లుల మరణాల శాతం తగ్గించవచ్చన్నారు. ఒకవేళ హైరిస్క్ గర్భిణులను గుర్తించి సమీప సామాజిక ఆరోగ్య కేంద్రం, ఏరియా ఆసుపత్రులు, ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స అందించాలన్నారు. సమావేశంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనకాలజీ హెచ్‌వోడి డాక్టర్ పద్మజ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుగుణ, డాక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



వేడికి 'చల్ల'గా..

ఎండాకాలం అప్పుడే వచ్చేసినట్లు ఉంది. పగటి సమయంలో ఉష్ణోగ్రతలు మండుతున్నాయి. మధ్యాహ్న సమయంలో భానుడు భగభగమంటున్నారు. వేడిని తట్టుకోలేక చిన్నారులు ఐస్ క్రీమ్‌లు లాగించేస్తున్నారు. బుధవారం కర్నూలు సమీపంలోని పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ వద్ద విద్యార్థులు పుల్ల ఐస్ తింటున్న దృశ్యమిది. –సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

బీసీ కులగణనపై నేడు రౌండ్ టేబుల్ సమావేశం

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలో బీసీ కులగణనపై ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక బీసీ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ నక్కలమిట్ట శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కులగణనతో పాటు రాష్ట్రంలో బీసీలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన మేధావులు, బీసీ సంఘాల నాయకులు, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల్లోని బీసీ నేతలు పెద్ద సంఖ్యలో ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

త్రివిక్రమ వర్మకు నివాళి

అవుకు: గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందిన రాజవంశీయుడు నంద్యాల త్రివిక్రమ వర్మ అంత్యక్రియలు బుధవారం అవుకులో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి అవుకులోని రాజుగారి స్వగృహానికి చేరుకుని వర్మ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అవుకు సామ్రాజ్యాన్ని పాలించే కాలంలో వారి పూర్వీకులు అవుకుకు ఎనలేని సేవలనందించారని గుర్తుచేశారు. అనంతరం త్రివిక్రమ వర్మ భార్య భాగవతి, కుమారుడు అభినాష్ ప్రశాంత్ వర్మలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధైర్య పడొద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకుడు పండ్ల వాయునందన గౌడ్, బలిజ సంఘం నాయకుడు రామన్న, గ్యాంగ్ దస్తగిరి పాల్గొన్నారు.



త్రివిక్రమ వర్మ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

కొనసాగుతున్న డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బుధవారం జరిగిన డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలకు 25 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 11 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 36 మందికి 11 మంది హాజరు కాగా 25 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు.



కొండ మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద పూజల అనంతరం మాట్లాడుతున్న కాటసాని

రైతన్నల పరిస్థితి దుర్భరం

- ఏ పంటకు మద్దతు ధర లేదు
- కూటమి సర్కారు పట్టనట్టు వ్యవహరిస్తోంది
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని

పాణ్యం: దేశానికి అన్నంపెట్టే రైతన్నల పరిస్థితి ప్రస్తుతం రాష్ట్రంలో దుర్భరంగా మారిందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాల్సిన కూటమి సర్కారు చోద్యం చూస్తోందని మండిపడ్డారు. బుధవారం తమ్మరాజుపల్లె కొండలపై వెలసిన కొండ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆయన పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాటసాని మాట్లాడుతూ రైతును గతంలో ఎన్నడూ లేని విధంగా దళారీల చేతికి అప్పగించారన్నారు. దీంతో వారు అడిగిన ధరకే పంట ఉత్పత్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. అధికారంలోకి వచ్చి 9 నెలలవుతున్నా కూటమి సర్కారు రైతుకు పైసా సాయం చేయలేదని మండిపడ్డారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ. 20 వేలు ఇస్తామని ఎన్నికల ముందు ప్రకటించి నేటికీ అమలు చేయకుండా రైతులను చంద్రబాబు మోసం చేశారని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఉండేదని, ఏటా పంటపెట్టుబడికి రైతు భరోసా పథకం కింద సాయం అందేదని చెప్పారు. ఇప్పుడు సాయం దేవుడెరుగు కనీసం రైతుల గోడు కూడా బాబు సర్కారు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీల అమలుకు రైతుల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాడుతుందని చెప్పారు.

యూరియా పంపిణీలో విఫలం

రైతులకు అవసరం మేరకు యూరియాను పంపిణీ చేయడంలో కూటమి సర్కారు విఫలమైందని పార్టీ జిల్లా అధ్యక్షుడు కాటసాని విమర్శించారు. అధికారపార్టీ నాయకులు, కొందరు దళారులు యూరియా కొరత సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారని, బస్తాపై రూ.150–200 అదనంగా వసూలు చేస్తున్నారని చెప్పారు. దీంతో సామాన్య రైతులకు యూరియా కొనుగోలు భారమైందన్నారు. ఇప్పటికైనా సర్కారు స్పందించి రైతులకు అవసరం మేరకు యూరియా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, నంద్యాల జిల్లా పంచాయతీ రాజ్ అధ్యక్షుడు రామలక్ష్మీయ్య, పిన్నాపురం సర్పంచ్ ఎల్లక్రిష్ణయ్య , కందికాయపల్లె సర్పంచ్ రామచంద్రుడు, శేషారెడ్డి, బాలిరెడ్డి, శేషు, రామకిట్టు, జయచంద్రారెడ్డి, శేషయ్య, చందమామబాబు, సుమంత్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి , గగ్గటూరు శ్రీనివాసరెడ్డి,సత్యాలు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడిపై దాడి



గాయపడిన సుభాష్

కృష్ణగిరి: మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సురేంద్రకుమార్ (సుభాష్)పై ఇదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దామోదర్‌నాయుడు దాడికి పాల్పడ్డాడు. గ్రామస్తులు, బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం మధ్యాహ్నం సుభాష్ తన బైక్‌పై మరో వ్యక్తితో కలిసి వెల్దుర్తికి వెళ్తుండగా కృష్ణగిరి పోలీస్‌స్టేషన్ వెళ్లే రహదారి వద్ద దామోదర్‌నాయుడు సుభాష్ బైక్ నిలిపి దాడికి పాల్పడ్డాడు. వెంటనే అతను ఆత్మ రక్షణ కోసం ఎదురుదాడికి దిగగా.. ఇంతలో టీడీపీకి చెందిన మరో వ్యక్తి అడివయ్య రాళ్లతో సుభాష్‌పై దాడి చేశాడు. ఈ ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు వచ్చి ఇద్దరిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడి నుంచి చికిత్స నిమిత్తం ఆస్పత్రులకు తరలించారు. గతేడాది కూటమి పార్టీ గెలిచిన వెంటనే ఇదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అధికారపార్టీ నాయకులు దాడికి పాల్పడ్డారు.

సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- కలెక్టరేట్ ఎదుట వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా



నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. వామపక్షాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌ను సవరించైనా ఆంధ్రప్రదేశ్‌కు నిధులు కేటాయించాలన్నారు. విశాఖపట్నం ఉక్కు ఫ్యాక్టరీ, రైల్వే జోన్ల కోసం నిధులను సాధించడంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. కడప స్టీలు ప్లాంటు కోసం నిధులను రాబట్టడంలో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్లను కేటాయించాలన్నారు. జిల్లా పశ్చిమ ప్రాంతంలోని వలసల నివారణకు వెంటనే పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. వామపక్ష పార్టీల నాయకులు రాజశేఖర్, రామకృష్ణారెడ్డి, రాముడు, విజయ్, షరీఫ్, అబ్దుల్‌దేశాయ్, రామకృష్ణ పాల్గొన్నారు.

మైనింగ్ యజమానులపై జీఎస్టీ భారం

- గత మూడేళ్ల బకాయిలు చెల్లించాలని నోటీసులు
- సర్కారు నిర్ణయంతో నాపరాళ్ల పరిశ్రమ మనుగడపై తీవ్ర ప్రభావం



జీఎస్టీ చెల్లించాలని యజమానికి ఇచ్చిన నోటీసు

కొలిమిగుండ్ల: నాపరాతి గనుల యజమానులపై జీఎస్టీ రూపంలో మరో భారం పడుతుంది. ఇప్పటికే ఈ పరిశ్రమ నష్టాలతో కొట్టుమిట్టాడుతోంది. తాజాగా మూడేళ్ల నుంచి బకాయి ఉన్న జీఎస్టీ చెల్లించాలని యజమానులకు కర్నూలులోని జీఎస్టీ కార్యాలయం నుంచి నోటీసులు అందుతున్నాయి. నాపరాతి గనుల తవ్వకాల కోసం లీజు అనుమతి, మైనింగ్ ప్లాన్, ఎన్విరాల్‌మెంట్ క్లియరెన్స్ (ఈసీ) ఉన్న యజమానులు బనగానపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా 40 మంది ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీరికి మాత్రమే ఆన్‌లైన్‌లో రాయల్టీలు మంజూరు చేస్తుంది. నియోజకవర్గంలో చాలా మందికి లీజులు ఉన్నప్పటికి ఈసీ, మైనింగ్ ప్లాన్ లేదనే కారణంతో ఆన్‌లైన్ రాయల్టీలు నిలుపదల చేసింది. 2020-21-2021-22-2022-23 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి జీఎస్టీ బకాయిలు చెల్లించాలని యజమానులకు పోస్టల్ ద్వారా నోటీసులు పంపుతున్నారు. అంకిరెడ్డిపల్లెకు చెందిన మైనింగ్ యజమాని కొప్పుల చంద్రశేఖర్‌రెడ్డి రూ.3.64 లక్షలు బకాయి చెల్లించాలని ఇటీవలనే నోటీసు పంపించారు. మిగిలిన యజమానులకు ఒక్కొక్కరికి నోటీసులు అందుతున్నాయి. నాపరాళ్లు వెలికి తీసి రవాణా చేసేందుకు ఆన్‌లైన్ రాయల్టీలు పొందాల్సి ఉంటుంది. ప్రతి రాయల్టీపై యజమానులు రాష్ట్ర ప్రభుత్వానికి సీనరేజ్, డీఎంఎఫ్ తదితర పన్నులు చెల్లిస్తుంటారు. కానీ జీఎస్టీ ఎప్పటికప్పుడు వాటితో పాటే వసూలు చేయకుండా పెండింగ్ పెట్టి ఒకే సారి లక్షల్లో చెల్లించాలని చెప్పడంతో యజమానులకు దిక్కుతోచడం లేదు. గత మూడేళ్ల నుంచి నిమ్మకుండి ఆర్థిక సంవత్సరం ముగిసే సమయంలో వసూలు చేసేందుకు సెంట్రల్ జీఎస్టీ అధికారులు ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తుంది. పోటీ ప్రపంచంలో నాపరాళ్ల పరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకంగా ఉన్న తరుణంలో మళ్లీ జీఎస్టీ రూపంలో యజమానులపై పిడుగు పడటంతో వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

కర్నూలు వ్యవసాయ మార్కెట్ ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశెనగ	2,222	7,077
పొద్దుతిరుగుడు	5,029	5,029
ఆముదం	5,659	5,805
వాము	2,001	25,140
ఉల్లి	680	2,821
ఎండుమిర్చి	3,469	13,301
శనగలు	2,100	5,916
కందులు	2,000	7,478
మొక్కజొన్న	2,110	2,241
మినుములు	6,509	7,911
కొర్రలు	2,300	2,891
సోయాచిక్కుడు	1,463	3,909
సజ్జలు	2,111	2,189

ఫోన్ నం : 08518-257204, 257661